# శారీస్ అండ్ సారోస్

పది గంటలైంది.

వానాకాలం ఎండ...ఎండాకాలం ఎండలా వుంది.

నెత్తి చుర్రుమంటోంది.

పైట కొంగుతో మొహం తుడుచుకుని, వీధికి అటూ యిటూ వున్న ఇళ్ళన్నీ చూసుకుంటూ ముందుకు నడిచింది. జానకి .కొంత దూరం నడిచి ఒక యింటి గుమ్మం ముందాగి తలుపు తట్టింది.

ఎవరూ పలకలేదు.

మళ్ళీ తలుపు తడుతూ 'ఏమండీ', 'ఏమండీ' అనిపిలిచింది. అలసట వల్లా ఆయాసం వల్లా గొంతు పెగిలి రావటం లేదు. మూడు నాలుగుసార్లు పిలిచాక తలుపు తెరుచుకుంది ఎవరో పదేళ్ళ కుర్రాడు తలుపు తీశాడు.

'మీ అమ్మగారున్నారా బాబూ?'-అని అడిగింది జానకి.

'లేదు'-అన్నాడు, జానకిని తేరిపారచూస్తూ ఆ కుర్రాడు.

జానకి మరో ప్రశ్న వెయ్యబోయేలోగా - మా అమ్మ ఈ వూళ్ళో వుండదు..అన్నాడు మళ్ళీ

'ఈ యిల్లు మీది కాదా...?'

'కాదు...మా పిన్ని గారిది...'

'పోనీ మీ పిన్నిగారున్నారా...?'

'ఉంది...వంటింట్లో వుంది.'

'వొక్కసారి పిలువ్ బాబూ..' ప్రాధేయపడుతున్నట్టుగా అడిగింది జానకి.

కుర్రాడు అక్కణ్ణించి కదలకుండా-'మీరెవరు?... మీ పేరేమిటి?-అని అడిగాడు జానకిని ఏమాత్రం తొణక్కుండా బెణుక్కుండా.

ఏం సమాధానం చెప్పాలో తెలీలేదు జానకికి. కాస్సేపు తటపటాయించి-'మీ పిన్నిగారిని పిలువ్ బాబూ...'-అంది మళ్ళీ.

కుర్రాడు కాస్సేపు జానకిని ఎగాదిగా చూసి లోపలికెళ్ళిపోయాడు.

జానకి ఆ గది నలువైపులా పరీక్షగా చూసింది. గదిలో నాలుగైదు మామూలు కుర్చీలూ, ఒక టీపాయ్ వున్నాయి. గోడలకి సినిమాతారల కేలండర్లున్నాయి

కాస్సేపు ఆ బొమ్మలు చూసింది జానకి.

కాళ్ళు లాగుతున్నాయి.

లోపల్నించి ఎవరూ రాలేదు.

ఒక కుర్చీలో కూలబడింది జానకి, యింక చేసేది లేక.

ఇవ్వాళింకా పదిళ్ళయినా తిరగాలి. ఒక్కచోటయినా కాదు-అక్కడో యింటికీ, అక్కడో యింటికీ వెళ్ళాలి. ఇంటి కెళ్ళేసరికి ఎంతవుతుందో..ఈ ఎండకే మొచ్చింది పోయేకాలం....

జానకి మరోసారి కొంగుతో మొహం తుడుచుకుంది. తుడుచుకున్నాక వొక్కసారి తన చీరంతా పరీక్షగా చూసుకుంది.

బాగా నలిగిపోయింది

అప్పుడే మాసిపోయింది. పైట కొంగు మరీనూ.

లోపల్నించి ముప్ఫయ్యేళ్ళ స్త్రీ వచ్చింది.

ఆమెని చూడగానే జానకి గభాల్న లేచి నిలబడి, నమస్కారం చేసింది.

ఎవరూ, ఏమిటన్నట్టుగా చూసింది ఇంటావిడ. ఆవిడ ఏమీ అడక్కముందే- జానకి తనొచ్చిన పనిచెప్పి, మామూలు పాటంతా పాడింది.

'కూర్చోండి'-అంది యింటావిడ.

జానకి కూర్చుని, పెన్నూ కాయితాలూ తీసింది.

ఇంటావిడ కూడా కూర్చుంది.

జానకి మెల్లగా ఒక్కొక్క ప్రశ్నే అడుగుతూ. తన దగ్గరున్న కాగితాల్లో వేరు వేరు కాలమ్స్ నింపుకోడం ప్రారంభించింది.

'మీ పేరు?...వయసు?...మీ వారి పేరు? వృత్తి? జీతం? మీరు సంవత్సరానికి ఎన్ని చీరెలు కొంటారు? మీరే తెచ్చుకుంటారా. మీ వారు తెస్తారా? ఎక్కువగా ఏ రకం చీరెలు కడతారు? కాటన్...సిల్క్...టెరీన్...టెరీకాట్...మిగతా సింథటిక్ రకాలు...ఏవి ఎక్కువ యిష్టం మీకు? మీరు బయటికెళ్ళినప్పుడు...సందర్భాన్ని పట్టి చీరె కడతారా...లేదా మీ యిష్టమొచ్చింది ఏదో ఒకటి కడతారా? ఎప్పటికప్పుడు లేటెస్ట్ డిజైన్స్ కోసం చూస్తారా, ఎప్పుడూ ఒకటే రకం కొంటారా? మీ యింట్లో చీరెలు కట్టే ఆడవాళ్ళింకా ఎవరైనా వున్నారా? మీరు చీరెలు పూర్తిగా చిరిగే వరకూ కడతారా, లేకపోతే...' అన్నీ యిలాంటివే ప్రశ్నలు. ఇలాంటివే యింకా చాలా ప్రశ్నలు.

పాపం ఆ యింటావిడ అన్ని ప్రశ్నలకీ వోపిగ్గా సమాధానాలిచ్చింది.

ఎదురు ప్రశ్నలు వెయ్యలేదు. బతికి పోయాననుకుంది జానకి.

ప్రశ్నలన్నీ అడిగి, రాసుకునే సరికి పావుగంట పైనే పట్టింది.

రాసుకున్నాక, అన్ని కాలమ్సూ సరిగ్గా వున్నాయో లేదోనని మరోసారి చూసుకుంది జానకి.

కాగితాలు సర్దుకుని, లేచి నిలబడి ఆ యింటావిడకి థాంక్స్ చెప్పి, నమస్కారం చేసి బయటికొచ్చింది.

బయట ఎండ యింకా పెరిగి నట్టుగా వుంది.

అయినా తప్పదు. ఇంకా తిరగాల్సిందే. ఇవ్వాళ అనుకున్న లెక్క ప్రకారం, యింకా తిరగవలసిన యిళ్ళన్నీ తిరగాల్సిందే. ఈ నెలాఖరులోగా సిటీ మొత్తమ్మీద అయిదు వందల యిళ్ళు కవర్ చెయ్యాలి. తప్పదు.

తర్వాతి యిల్లు ఏది ఎన్నుకోవాలో అని ఆలోచిస్తూ ముందుకి నడిచింది జానకి. ఆ బజారు దాటి మరోబజార్లోకి వెళ్ళింది.

బజారుకు కి కుడివేపున పెద్ద మేడ వుంది. జానకి భయపడుతూ భయపడుతూ గేటు తోసుకుని లోపలి కెళ్ళింది. పోర్టికో దగ్గర నిలబడి కుక్కల్లాంటివి ఏమైనా ఉన్నాయేమోనని

చూసింది. ఉన్నట్టులేవు. వరండాలోకి నడిచింది. తలుపులు మూసివున్నాయి. పిలవడానికి కాస్త సంకోచించింది. భయపడింది కూడాను. దిక్కులు చూసింది. గోడకి-బెల్ తాలూకు స్విచ్ కనబడింది. భయపడుతూ భయపడుతూ స్విచ్ నొక్కింది.

మరో రెండు నిమిషాలకి తలుపు తెరుచుకుంది. నౌఖరొచ్చి, ఎగాదిగా చూసి ఏం కావాలని అడిగాడు. జానకి తనొచ్చిన పనిచెప్పింది.

నౌఖరు కర్థం కాలేదు.

మీ అమ్మగారిని పిలవమంది జానకి.

అమ్మగారు బాత్రూమ్‌లో వున్నారన్నాడు నౌకరు.

ఆవిడొచ్చేవరకూ వెయిట్ చేస్తానంది జానకి.

నౌఖరు కాస్సేపు ఆలోచించి సరే నన్నట్టుగా తలవూపాడు.

లోపలికి పిల్చి కూర్చోబెడతాడేమో ననుకుంది జానకి.

నౌఖరు లోపలికి పిలవలేదు. తను లోపలి కెళ్ళిపోయాడు.

జానకి అక్కడే ఒక కుర్చీలో కూర్చుంది. ఆ కుర్చీలన్నీ చూసింది. బయటే. యింత మంచి కుర్చీలుంటే లోపల యింకెంత మంచివుంటాయో అనుకుంది. అనుకుని, వెంటనే నాలుక కొరుక్కుంది.

'లోపల కుర్చీలుండవ్; సోఫాలుంటాయి'-అనుకుంది. మేడ ముందు పెద్దలాన్, చుట్టూ పూలచెట్లూ వున్నాయి. బయట ఎండగా వున్నా వరండాలో చల్లగానే వుంది. జానకి మరోసారి కొంగుతో మొహం తుడుచుకుంది. మళ్ళీ తన చీర వంక చూసుకుంది. పైట కొంగు యింకా మాసిపోయినట్టనిపించింది.

బేగ్ వుందిగాని, బేగ్‌లో కర్చీఫ్ లేదు. ఇవ్వాళ తెచ్చుకోలేదు. ఉన్న నాలుగింటిలోనూ మూడు చిరిగి పోయాయి. ఒకటి బాగా మాసిపోయి, చెమట వాసనేస్తూ వుంటే యింట్లో వదిలేసి వచ్చింది. ఉతుక్కు తెచ్చుకునే టైమ్ లేకపోయింది.

'రెండు కర్చీఫ్‌లు కొనుక్కోవాలి!' అనుకుంది జానకి. 'ఇక్కడ చల్లగానే వుంది... ఇక్కడే యింత చల్లగా వుంటే లోపల యింకెంత చల్లగా వుంటుందో..." అనుకుంది.

మరోపావుగంటకి నౌఖరొచ్చి లోపలికి రమ్మని పిలిచాడు. జానకి అతని వెంటే లోపలికి నడిచింది. నౌఖరు డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు.

ఆ డ్రాయింగ్‌రూమ్ నాలుగు రూమ్‌లంత పెద్దదిగా వుంది.

జానకి అనుకున్నట్టుగానే సోఫాలున్నాయి. సోఫాలు చాలా మెత్తగా వున్నాయి. అందంగా కూడా వున్నాయి. జానకి అనుకున్నట్టుగానే లోపల చల్లగా వుంది. చాలా చల్లగా వుంది. 'ఎయిర్ కండిషన్డ్'-అనుకుంది జానకి తనలో తాను.

జానకికి చాలా అలసటగా వుంది. ఆకలిగా వుంది. కళ్ళు తిరిగాయి. అలసట వల్లా ఆకలి. వల్లాకాదు. ఆయింటి వైభవం చూసి.

ఆ యింటి యజమానురాలు కూడా యిల్లంత దర్జాగానూ వుంది. అందంగా కూడా వుంది. ఆమెని చూస్తే జానకికి కళ్ళు తిరగలేదు. కాని అసూయ వేసింది.

ఇంటి యజమానురాలు ఠీవిగా వుంది.

దర్పంగా వుంది.

జానకికి భయమేసింది.

నమస్కారం చేసి, భయపడుతూ భయపడుతూ మెల్లగా తనొచ్చిన పని చెప్పింది జానకి. ఇంటావిడ అంగీకారసూచకంగా నెమ్మదిగా ఠీవిగా, ఒకసారి తలపైకీ కిందికీ ఆడించింది. జానకికి కాస్త భయం తగ్గింది.

కాగితాలూ పెన్నూ తీసుకుని మెల్లమెల్లగా ఒక్కొక్క ప్రశ్నే అడగటం ప్రారంభించింది.

'మీ పేరు?...వయసు? మీ వారి పేరు? వృత్తి?...ఆదాయం? మీరు సంవత్సరానికి ,పోనీ నెలకి...ఎన్ని చీరెలు కొంటారు? ఎలాంటి..?

ఇంటావిడ అన్నిటికీ స్టయిల్‌గా ఠీవిగా జవాబు లిచ్చింది. కొన్నిటికి ఇంగ్లీషులో జవాబు లిచ్చింది. మరి కొన్నిటికి ఇంగ్లీషులాంటి తెలుగులో జవాబులిచ్చింది.

ఆమె చెప్పిన జవాబులు విని జానకికి మరోసారి కళ్ళు తిరిగాయి-ఆశ్చర్యంతోనూ, కించిత్తు అసూయతోనూ.

వివరాలన్నీ రాసుకుని వుస్సురని నిట్టూర్చింది జానకి. కొంగుతో చెమట తుడుచుకోబోయి, చెమట పట్టలేదన్న సంగతి చటుక్కున గుర్తొచ్చి, ఆ ప్రయత్నం మానేసింది.

బాగా ఆకలేస్తోంది.

ఈవిడ కాఫీ అయినా యిస్తే బావుండుననుకుంది. ఇస్తుందేమోనని ఆశపడింది.

కాని-ఆ యింటావిడ మంచినీళ్ళయినా యివ్వలేదు. కనీసం కావాలా అని అడగనైనా

లేదు.

ఇంత డబ్బుంది. కనీసం కాఫీ అయినా యివ్వకూడదూ...'అనుకుంది జానకి.

మెల్లగా లేచి, థాంక్స్ చెప్పి, నమస్కారం చేసి, బయటికొచ్చింది.

ఇందాకట్నించీ తప్పించుకున్నావ్..యిప్పుడెక్కడికి పోతావన్నట్టుగా ఎండ జానకిమీద మండి పడింది.

'ఈ ఎండకేమొచ్చింది పోయే కాలం'...?-అనుకుంది జానకి. ఎండమీద కోపమొచ్చింది. కడుపులో ఆకలి కూడా మండుతోంది.

'ఛీ...వెధవ ఆకలి...'-అనుకుంది. ఏదైనా హోటల్‌కి వెళ్ళి కాఫీ తాగుదామా అనిపించింది. బాగ్ తెరిచి లోపల డబ్బులు చూసుకుంది. 'వద్దులే...ఆలస్యమైపోతుంది. పనిపూర్తి చేసుకుని త్వరగా యింటికెళ్ళిపోవాలి...' అనుకుంది-' డబ్బులు చాలవ్'-అనుకోటం యిష్టంలేక.

గబగబా నడిచింది.

గబగబా నడవలేకపోయింది.

ఇంకో బజారు కెళ్ళాలి.

రిక్షాలో వెళ్దామా అనిపించింది.

'వద్దులే..ఎందుకూ అదొక దండగ...' అనుకుంది.

ఆకలినీ అలసటనీ ఎండనీ మర్చి పోవటానికి ప్రయత్నిస్తూ, మాటి మాటికీ కొంగుతో మొహం తుడుచుకుంటూ వీధులు మారుతూ యిల్లిల్లూ తిరిగింది మొత్తానికి ఎలాగైతేనేం, తననుకున్నన్ని యిళ్ళూ తిరిగింది.

* * *

కొన్ని అగ్గి పెట్టెల్లాంటి యిళ్ళు; కొన్ని ఇంద్రభవనాల్లాంటి యిళ్ళు. కొన్ని మధ్య తరగతి యిళ్ళు. కొన్ని పూటకి గడవని సంసారాలు. కొన్ని పూటకి వంద రూపాయలు ఖర్చు చేసే సంసారాలు. మరికొన్ని మధ్య తరగతి సంసారాలు; చాలీ చాలని సంసారాలు. ఒకమ్మకి పది చీరెలున్నాయి. ఒకమ్మకి యిరవై వున్నాయి. ఒకావిడకి పాపం నాలుగే వున్నాయి. మరో తల్లికి ఎన్ని చీరెలున్నాయో ఆవిడకే తెలీదు. కొందరికి పట్టు చీరెలంటే సరదా ; కొందరికి టెరీన్ చీరెలంటే మోజు; మరి కొందరికి వాయిల్ చీరలంటె యిష్టం. ఇంకొందరికి నేత చీరెలు...

కొందరు అనుమానించారు. కొందరు అవమానించారు. కొందరు చిరాకు పడ్డారు.

మరికొందరు విసుక్కున్నారు. ఇంకొందరు ఎదురు ప్రశ్నలు వేశారు. నీ కెందుకన్నారు. కొందరు సిగ్గుపడ్డారు. కొందరు డంబాలు పలికారు. కొందరు...

అర్థం చేసుకున్న వాళ్ళూ ఆహ్వానించిన వాళ్ళూ ఆదరించిన వాళ్ళూ తక్కువ.

* * *

జానకి బస్సుకోసం నిలబడి నిలబడి, బస్సు దొరికి యింటికి చేరుకునే సరికి మధ్యాహ్నం రెండున్నరైంది.

ఎండవల్లా తిరుగుడువల్లా అలసట వల్లా ఆకలి వల్లా-ఇంటికి చేరుకునేసరికి జానకి పని అయిపోయింది.

ఇంట్లోకెళ్ళి, కాయితాలవీ వొక మూల పారేసి మంచానికడ్డం పడింది.

తల్లిని పిలిచి, 'అమ్మా...అన్నం పెడతావా?'-అని అడిగింది నీరసంగా.

కాసేపట్లో అన్నం పెట్టాను రమ్మని పిలిచింది జానకి తల్లి.

జానకి మెల్లగా లేచి, కాళ్ళూ చేతులూ కడుక్కుని, పీట మీద కూర్చుంది. తల్లి వడ్డిస్తూండగా-పచ్చడితో నాలుగు మెతుకులూ, మజ్జిగతో నాలుగు మెతుకులూ తిని లేచింది మంచినీళ్ళు ఎక్కువ తాగటం మూలాన అన్నం తినలేకపోయింది.

మళ్ళీ వచ్చి మంచమ్మీద పడుకుంది. చీరె మార్చుకోడానిక్కూడ వోపిక లేకపోయింది అలాగే పడుకుంది. కాస్సేపటికి నిద్రపట్టింది.

నిద్రపడుతూ పడుతూ వుండగానే పెద్ద చెల్లెలొచ్చి లేపేసింది.

'అక్కా, చీర విప్పకుండానే అలాగే పడుకున్నావేమిటే? నేను టైప్ నేర్చుకోడాని కెళ్ళాలి. త్వరగా లేచి చీర విప్పి యివ్వు...'-అంది.

జానకి లేవక తప్పలేదు.

నీరసంగా బద్ధకంగా లేచి, చీర విప్పి చెల్లెలి కందించింది.

మరో చీర కట్టుకుంది. ఆచీరె పాతది. అక్కడక్కడా చిరిగిపోయిందికూడాను.

జానకి చెల్లెలు-అక్క విప్పిన చీరె తీసుకుని-'ఇదేమిటే అక్కా, చీరంతా యిలా నలిపేశావ్? బాగా మాసిపోయింది కూడాను...ఛీ...'-అని గొణిగింది.

జానకి ఏమీ మాట్లాడలేదు. మళ్ళీ వెళ్ళి మంచమ్మీద పడుకుని కళ్ళు మూసుకుంది

*   *   *

జానకి తండ్రి జానకి చిన్నప్పుడే పోయాడు. జానకికి ముగ్గురు చెల్లెళ్లు ఒక తమ్ముడూ. నానా తిప్పలూ పడి ఇంటర్మీడియెట్ దాకా చదువుకుంది. ఆపైన చదివే స్తోమతులేదు. ఏదో వొక వుద్యోగం చేసి కుటుంబాన్ని పోషించాలి. పెద్ద చెల్లెలు పదోక్లాసుతోనే ఆపేసి టైప్ నేర్చుకుంటోంది. మిగతా వాళ్ళు చదువుకుంటున్నారు.

జానకికి ఎక్కడా వుద్యోగం దొరకలేదు. దేశంలోని ఒక పెద్ద టెక్స్టైల్ కంపెనీవారు- దేశంలో చీరెల వాడకం, ఫాషన్సు, చీరెల కొనుగోళ్ళు, కొనేవాళ్ళ అభిరుచులూ మొదలైన విషయాల గురించి పరిశీలించేందుకుగాను, ఒక సర్వే ప్రారంభించారు. ఆ పథకం కింద ఆ నగరంలో ఐదువందల యిళ్ళు కవర్‌చేసి, అందుకు చెందిన వివరాలన్నీ సేకరించాలి. ఆ కంపెనీలో పనిచేసే ఒకావిడ ధర్మమా అని-ఆ నగరంలో సర్వేపని జానకికి లభించింది. మొత్తం పనంతా నెలరోజుల్లో అయిపోవాలి. ఐదొందలిస్తారు.

*   *   *

రెండు పూటలా తిండికి గడవటమే కష్టంగా వున్న జానకి యింట్లో-వయసులో వున్న ఆడ పిల్లలు బయటికి కట్టుకెళ్ళడానికి పనికొచ్చే చీరె-జానకికీ జానకి పెద్ద చెల్లెలికీ కలిపి ఒక్కటే వుంది.

మిగతా చెల్లెళ్ళకింకా చీరెలు కట్టేవయసు రాలేదు.

రెండో చెల్లెలికి కూడా త్వరలో చీరెల అవసరం వస్తుంది. ●

*(జ్యోత్స్న మాస పత్రిక : నవంబరు 1972)*